ప్రజాశక్తి
శనివారం 5 ఏప్రిల్ 2025
5
పార్వతీపురం మన్యం



పలుచోట్ల ఉరుములు, మెరుపులతో వర్షం



కురుపాంలో కురుస్తున్న వర్షం

కురు పాం: మన్యం జిల్లాలో కురుపాం, పార్వతీపురం, సీతానగరం, వీరఘట్టంతో శుక్రవారం సాయంత్రం ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ తీవ్రత, ఉక్క పోతకు గురై బాలింతలు, గర్భిణీలు, వృద్ధులు, దీర్ఘకాలిక రోగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రాత్రి కురిసిన వర్షంతో వాతావరణం చల్లబడింది. ఎండ వేడిమి నుండి కొంత ఉపశమనం లభించింది.

వక్ఫ్ చట్ట సవరణ బిల్లును రద్దు చేయాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగు నాయుడు



వక్ఫ్ చట్ట సవరణ బిల్లుపై ముస్లిములకు అవగాహన కల్పిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గంగునాయుడు

ప్రజాశక్తి - కురుపాం

మతోన్మాద ఎజెండా అమలులో భాగంగా బిజెపి ప్రభుత్వం ముస్లిములపై విద్వేషాన్ని చిమ్ముతూ అనేక దాడులు చేస్తుందని సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు విమర్శించారు. వక్ఫ్ చట్ట సవరణ బిల్లు అమలుకు పార్లమెంట్లో ఆమోదం పొందిన దాన్ని వ్యతిరేకిస్తూ స్థానిక జామియా మసీద్‌లో శుక్రవారం ముస్లిములకు కరపత్రాలు పంపిణీ చేసి వక్ఫ్ చట్ట సవరణ బిల్లుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిజెపి అధికారం చేపట్టినప్పటి నుంచి లవ్ జిహాద్, ఘర్వాపసీ, కామన్ సివిల్ కోడ్, మసీదుల విధ్వంసం, మూక హత్యలతో మతోన్మాద శక్తులు తలపడుతున్నాయని, ఇప్పుడు సరికొత్తగా వక్ఫ్ సవరణ చట్టం ద్వారా ముస్లింలు ధార్మిక, సామాజిక, సాంస్కృతిక సంస్థలపై దాడి తలపెట్టిందని విమర్శించారు. ఈ చట్టం ఆస్తుల కబ్జా చేయడానికి తప్ప, వక్ఫ్ ఆస్తులు అభివృద్ధికి కాదన్నారు. బిజెపి దుర్మార్గమైన సవరణలు చేస్తూ ముస్లిం ప్రజల ఆస్తులపై యుద్ధం ప్రకటించే ఈ బిల్లును లౌకిక పార్టీలుగా చెప్పుకునే టిడిపి, జనసేనతో సహా మరికొన్ని పార్టీలు తమ స్వార్థ ప్రయోజనాలకు బలపర్చడంతో గురువారం పార్లమెంట్ సమావేశంలో ఈ బిల్లు ఆమోదం పొందిందని అన్నారు. టిడిపి, జనసేనల వైఖరి లౌకికత్వానికి విఘాతం కలిగించేలా ఉన్నాయన్నారు. సిపిఎంతో సహా మరికొన్ని ప్రతిపక్ష పార్టీలు ఈ బిల్లును పార్లమెంటులో గట్టిగా ఎదుర్కొన్నాయన్నారు. ఒకసారి వక్ఫ్ చేయబడిన ఆస్తులను శాశ్వతంగా వక్ఫ్ ఆస్తులుగానే ఉంటాయని వాటి స్వభావాన్ని మార్చే అధికారం ఎవరికి లేదని గతంతో సుప్రీంకోర్టు తీర్పించినప్పటికీ, దీనికి వ్యతిరేకంగా బిజెపి ఈ చట్టం చేయడం దుర్మార్గమని మండిపడ్డారు. భారత రాజ్యాంగంలోని 25, 29, 30 తదితర నిబంధనకు వ్యతిరేకంగా ఈ చట్టం చేయబడిందని, మసీదులు, దర్గాలు, స్మశానాలు ఇప్పుడు మరింత ప్రమాదంలో పడనున్నాయని, లక్షల ఎకరాల వక్ఫ్ ఆస్తులను కొల్లగొట్టబడతాయని, ఇతర మతాల వారిని వక్ఫ్ బోర్డు సభ్యుల్లో చేర్చి వాటిని వివాదాస్పదం చేసే కుట్ర ఈ సవరణ బిల్లులో ఉందని, ఇది భారత ప్రజలను మతపరంగా విభజించే కుట్రలో భాగమని, కావున లౌకిక, మైనారిటీ శక్తులన్ని సమైక్యంగా ముందడుగు వేసి దీన్ని తీవ్రంగా వ్యతిరేకించి ప్రతిఘటించాలని కోరారు. కార్యక్రమంలో మత గురువు షేక్ సర్దార్, ముస్లిం పెద్దలు షేక్ అతావుల్లా, షేక్ ఖలీల్, షేక్ పజురుల్లా , షేక్ గౌస్, షేక్ ఆదిల్, షేక్ జిలాని, షేక్ నిషార్ ముస్లిం యువత పాల్గొన్నారు.

పార్వతీపురం: వక్ఫ్ సవరణ బిల్లు అమలుకు పార్లమెంట్లో ఆమోదం పొందిన దాన్ని వ్యతిరేకిస్తూ సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక బంగారమ్మ కాలనీ, పాలకొండ రోడ్డులో గల మసీదుల్లో కరపత్రాలను పంపిణీ చేసి నాయకులు ప్రచారం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ నాయకులు బంకురు సూరిబాబు, పడాల రాజశేఖర్ ఈ చట్ట సవరణపై అవగాహన కల్పించారు.

రైతుల జీవనోపాధులు పెరగాలి

ఎకరాకు 10 క్వింటాళ్ల దిగుబడి సాధించాలి : కలెక్టర్




సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

ప్రజాశక్తి - గరుగుబిల్లి

జిల్లాలో వ్యవసాయ, ఉద్యానవన రంగాలతో ఉజ్వల భవిష్యతు ఉండబోతుందని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అభిప్రాయపడ్డారు. మండలంలోని ఉల్లిభద్ర వద్ద గల డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యానవన కళాశాలలో ఖరీఫ్ పంటల సాగులో ముందస్తు ఏర్పాట్లపై కలెక్టర్ అధ్యక్షతన శుక్రవారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన పద్ధతులను అవలంభించి, లాభసాటి పంటల ద్వారా రైతులకు అధిక ఆదాయం సమకూర్చేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని పేర్కొన్నారు. తద్వారా రైతులను ప్రోత్సహిస్తూ వారి జీవనోపాధులు మెరుగుపడాలని ఆకాంక్షించారు. జిల్లాలో వరితో పాటు కంది, చిరుధాన్యాలు, నిమ్మగడ్డి వంటి వాటికి అనుకూలమని, కావున వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. క్షేత్రస్థాయిలో అధికారులు పర్యటించి అంతర్ పంటల దిశగా రైతులను ప్రోత్సహించాలని కోరారు. ముఖ్యంగా రాగి (రాగులు) పంటకు జిల్లాలో మంచి గిరాకీ ఉందని, దాన్ని దృష్టిలో ఉంచుకొని, కొత్త పద్ధతుల ద్వారా ఎకరాకు 10 క్వింటాళ్ల రాగులు దిగుబడి వచ్చేలా రైతులను ప్రోత్సహించాలని కలెక్టర్ తెలిపారు. కాలానుగుణంగా పంటల మార్పిడి, పద్ధతులు ఉండాలని, అందుకు తగిన విధంగా రైతులకు శిక్షణ కార్యక్రమాలు, ఎక్స్ పోజర్ విజిట్స్, కొత్త విధానాలు అవలంభించడం వంటి వాటిపై రైతులను చైతన్యపర్చాలన్నారు. ఇందుకు ప్రతి గ్రామం నుంచి ఆసక్తి, ఉత్సాహం ఉన్న రైతును ఎంపిక చేసుకొని, ఆ రైతు ద్వారా గ్రామంలోని ఇతర రైతులకు అవగాహన కల్పించడం ద్వారా మెరుగైన ఫలితాలు ఉంటాయని కలెక్టర్ అభిప్రాయపడ్డారు. వాట్సాప్ గ్రూప్ ద్వారా రైతులకు ఎప్పటికప్పుడు సమాచారాన్ని చేరవేయాలని, జూన్ మాసాంతంలోగా రైతులకు శిక్షణ చేపట్టాలని కలెక్టర్ స్పష్టం చేశారు. అదేవిధంగా సాగులో మెళకువలు, జీవామృత వినియోగం, ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ, ఇతర పథకాలు వంటి వాటిపై వీడియో, రాత పూర్వక సమాచారాన్ని వాట్సాప్‌కు అనుసంధానిస్తామని కలెక్టర్ సూచించారు. పిఎండిఎస్‌ను విస్తృతం చేయాలన్నారు. రుతుపవనాలకు ముందు తక్కువ నీటి సాంద్రతతో రసాయనిక పద్ధతుల్లేకుండా విభిన్న పంటల శ్రేణితో బలమైన అంకురోత్పత్తిని రైతులు పొందవచ్చని, తద్వారా కరువు, చీడపీడలను పంటలు తట్టుకోగలవని, అలాగే అధిక దిగుబడి, ఆదాయం లభిస్తుందని కలెక్టర్ వివరించారు.

సమావేశంలో జిల్లా వ్యవసాయ, ఉద్యానవన, పశు సంవర్ధక అధికారులు కె. రాబర్ట్ పాల్, బి.మాధవి, డాక్టర్ ఎస్.మన్మధరావు, డిఆర్‌డిఎ, డ్వామా పీడీలు సుధారాణి, కె.రామచంద్ర రావు, కెవికె శాస్త్రవేత్త శ్రీనివాసరాజు, ఇతర అధికారులు, మండల, గ్రామ వ్యవసాయ విస్తరణ అధికారులు, రైతు సేవా కేంద్రాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



తాగునీటి సమస్యలపై అధికారులను అడిగి తెలుసుకుంటున్న పిఒ అశుతోష్ శ్రీవాస్తవ

తాగునీటి సమస్య తలెత్తరాదు : పిఒ

ప్రజాశక్తి - పార్వతీపురం

గిరిజన ప్రాంతాల్లో వేసవిలో తాగునీటి సమస్య లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని పార్వతీపురం ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాస్తవ గ్రామీణ నీటి సరఫరా ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన ఛాంబరులో పిఎం జన్‌మాన్, గిరి ప్రాంతాల్లో వేసవిలో తాగునీటి సరఫరాపై ఆయా శాఖల అధికారులతో పిఒ సమీక్షించారు. ఈ పథకం కింద మంజూరైన గృహాలను సకాలంలో పూర్తిచేయాలని తెలిపారు. ముఖ్యంగా చివరి దశలో ఉన్న గృహాలపై ప్రత్యేక దృష్టిని సారించాలన్నారు. ప్రభుత్వం బీసీ, ఎస్‌సిలకు రూ.50వేలు, ఎస్టీలకు రూ.75వేలు, పివిటిజిలకు రూ.లక్ష అదనపు ఆర్థిక సహాయాన్ని ప్రకటించిన సంగతిని లబ్ధిదారులకు అవగాహన కల్పించి, త్వరితగతిన నిర్మాణాలు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అలాగే గృహ నిర్మాణాలు జరిగే ప్రదేశాల్లో తాగునీటి సౌకర్యం కల్పించాలని, ఆ దిశగా గ్రామీణ నీటి సరఫరా ఇంజినీరింగ్ అధికారులు చర్యలు చేపట్టాలని పిఒ స్పష్టం చేశారు. వేసవి కావడంతో గిరి ప్రాంతాల్లో ఎక్కడా తాగునీటి సమస్య ఉండరాదని, తాగునీటి పరీక్షలు నిర్వహించాలని, క్రమం తప్పకుండా క్లోరినేషన్ జరగాలని ఆదేశించారు. సమావేశంలో ప్రత్యేక ఉప కలెక్టర్, గృహనిర్మాణ పీడీ పి.ధర్మచంద్రారెడ్డి, ఐటిడిఎ ఎపిఒ మురళీధర్, హౌసింగ్, ఆర్‌డబ్ల్యుఎస్ కార్యనిర్వాహక, ఉప కార్యనిర్వాహక, సహాయ ఇంజినీర్లు, సాంకేతిక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వనరుల కేంద్రం సిద్ధం కావాలి : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లా ప్రధాన కేంద్రంలో ఏర్పాటు కాబోయే జిల్లా పంచాయతీ వనరుల కేంద్రాన్ని వీలైనంత త్వరగా పూర్తికి సిద్ధం చేయాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ గుత్తేదారుడ్ని ఆదేశించారు. స్థానిక ఆర్‌డిఒ కార్యాలయం పక్కన రూ.200 లక్షల అంచనా వ్యయంతో కొత్తగా నిర్మించబోయే జిల్లా పంచాయతీ వనరుల కేంద్ర స్థలాన్ని కలెక్టర్ శుక్రవారం పరిశీలించారు. ఈ భవన నిర్మాణం పూర్తయితే జిల్లాలో వివిధ రకాల శిక్షణా కార్యక్రమాలు చేపట్టేందుకు వీలుంటుందని, అదేవిధంగా ఇతర ప్రభుత్వ కార్యకలాపాలను నిర్వహించు కోవచ్చని పంచాయతీరాజ్ శాఖ ఇంజినీర్లకు కలెక్టర్ తెలిపారు. అందుకే వీలైనంత త్వరగా భవన నిర్మాణ పనులను ప్రారంభించి అప్పగించాలని సూచించారు. ఏడాదిలోగా భవనం పూర్తి చేయాల్సి ఉన్నప్పటికీ, ఈ ఏడాది చివరి నాటికి భవనాన్ని నిర్మించి అందించాలని గుత్తేదారుడ్ని ఆదేశించారు. తొలుత భవన నిర్మాణ స్థలాన్ని సందర్శించి, గదుల మార్కింగులను పరిశీలించిన ఆయన భవన నిర్మాణ వివరాలను సంబంధిత ఇంజినీర్లను అడిగి తెలుసుకున్నారు. దాదాపు 8,500 చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మితమయ్యే ఈ కేంద్రాన్ని నాణ్యత ప్రమాణాలతో నిర్మించాలని ఆదేశించారు. పనుల్లో రాజీ పడొద్దని, శాశ్వతంగా నిలిచేలా భవన నిర్మాణ పనులను చేపట్టాలని గుత్తదారుని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ రాజ్ శాఖ డిఇ వి.సన్యాసిరావు, మండల ఇంజనీరింగ్ అధికారి గంటా చంద్రమౌళి, ఎస్.ఎస్. లాజిస్టిక్స్ కాంట్రాక్టర్ సురేష్, ఇతర ఇంజినీరింగ్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డిఎస్‌సికి ఉచిత శిక్షణ

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో వెనుకబడిన తరగతులు, ఆర్థికంగా బలహీన వర్గాల అభ్యర్థులకు సెకండ్ గ్రేడ్ టీచర్ పరీక్షకు ఉచిత శిక్షణ కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ, సాధికారత అధికారి ఇ.అప్పన్న శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిఎస్‌సికి ఆన్లైన్ ద్వారా శిక్షణా తరగతులను నిర్వహిస్తామన్నారు. డిఎస్సి పరీక్షకు ఆన్లైన్ ద్వారా శిక్షణకు దరఖాస్తు చేయు అభ్యర్థులు డిగ్రీ మార్కుల జాబితా, కుల, ఆదాయ, స్థానికత తెలిపే ధ్రువీకరణ పత్రాలు, డిఎస్‌సికి ఎంపికైన అభ్యర్థులు టిఇటి (టీచర్ ఎలిజిబులిటీ టెస్ట్) మార్క్ లిస్ట్ జిరాక్స్, రెండు పాస్ పోర్ట్ సైజు ఫొటోలు దరఖాస్తుతో జత చేయాలన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను జిల్లా బిసి సంక్షేమ, సాధికారిత అధికారి కార్యాలయం, ఆర్సియం స్కూల్, రూం నెంబర్.8 మొదటి అంతస్తు, ఆర్టిసి బస్ స్టాండ్ ఎదురుగా, పార్వతీపురం మన్యంకు అందజేయాలన్నారు. పూర్తి వివరాలకు 9701786751, 9700112711 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని ఆయన ఆ ప్రకటనలో వివరించారు.



స్మార్ట్‌మీటర్ల రద్దు, విద్యుత్‌ఛార్జీల తగ్గించాలంటూ కరపత్రాలను విడుదల చేస్తున్న సిపిఎం నాయకులు

స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి - పాలకొండ

రాష్ట్ర ప్రభుత్వం ప్రజలపై విద్యుత్ భారాలు వేసే స్మార్ట్ మీటర్లపై ప్రజలంతా పోరాడాలని సిపిఎం పాలకొండ మండల కమిటీ సభ్యులు పిలుపునిచ్చారు. స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని, కరెంట్ ఛార్జీలు తగ్గించాలంటూ గోడపత్రికలను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కమిటీ సభ్యులు దావాల రమణారావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు భారాలు వేయబోమని ప్రజలను నమ్మించి నేడు అధికారంలోకి వచ్చాక బాదుడే బాదుడుగా అన్ని రకాల నిత్యావసర సరుకుల ధరలు పెంచివేసేలా నిర్ణయాలు చేసిందని విమర్శించారు. ఇప్పటికే పెరిగిన ధరలతో సతమతమవుతున్న ప్రజలపై సెల్‌ఫోను రీఛార్జ్ వలే స్మార్ట్ కరెంటు మీటర్లు ఇళ్లకు ఏర్పాటు చేసి మరింత ఆర్థిక భారాలు వేసేందుకు కుట్ర పన్నుతోందని, ఇది చాలా దుర్మార్గమని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలపై మోపిన ట్రూ అప్ ఛార్జీలను ఉపసంహరించాలని, సెకీ ఒప్పందాలను రద్దుచేయాలని, స్మార్ట్ మీటర్లు పెట్టే ఆలోచన విరమించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు కాదా రాము, దూసి దుర్గారావు, ఆర్తమూడి లక్ష్మణరావు, ఎస్.గంగయ్య, గిరి హేమసుందర్, మల్లవరపు రమేష్, మజ్జి వీరన్న నాయుడు పాల్గొన్నారు.

కొమరాడ : రాష్ట్ర ప్రభుత్వం ప్రజలపై విద్యుత్ భారాలు భారీగా వేసేందుకు స్మార్ట్ మీటర్ల ప్రవేశపెట్టే ఆలోచనలో ఉందని, వీటిని రద్దు చేసి పెంచిన విద్యుత్తు ఛార్జీలను తగ్గించాలని కోరుతూ కొమరాడలో సిపిఎం ఆధ్వర్యంలో గోడపత్రికలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు కొల్లి సాంబమూర్తి పలువురు వినియోగదారులు పాల్గొన్నారు.

విద్యార్థుల తరలింపుతో డ్రాపౌట్స్

మండల సమావేశంలో సర్పంచ్ రామస్వామి



సమావేశంలో అధికారులను నిలదీస్తున్న రావికోన సర్పంచ్ రామస్వామి

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

నూతన విద్యా విధానం పేరిట ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులను సమీప ఆశ్రమ పాఠశాలకు తరలిస్తే విద్యార్థులు మధ్యలోనే బడి మానేసి డ్రాపౌట్సు పెరిగే అవకాశం ఉందని, కనుక ఈ విషయంపై ప్రభుత్వం పునరాలోచించాలని రావికోన సర్పంచ్ అధికారులను కోరారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ సమావేశ భవనలో ఎంపిపి మజ్జి శోభారాణి అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పలువురు మండల అధికారులు తమ ప్రగతి నివేదికలను వివరించారు. అనంతరం సర్పంచి కె.రామస్వామి మాట్లాడుతూ ప్రభుత్వం అనుసరిస్తున్న పలు అంశాలను వ్యతిరేకించారు. సొంతంగా అన్నం కూడా తినలేని వయసులో పిల్లలను తీసుకువెళ్లి ఆశ్రమ పాఠశాలలో వేస్తే వారు అక్కడి వాతావరణానికి ఎమడలేక బడి మానివేసే పరిస్థితి ఉంటుందన్నారు. ముఖ్యంగా గిరిజన విద్యార్థులకు విద్య దూరం అవుతుందన్నారు. అప్పుడు పిల్లలు లేరనే నెపంతో పాఠశాలను మూసివేసే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. దీనికి ఎంఇఒ సమాధానం ఇస్తూ పిల్లలు తల్లిదండ్రుల అభిప్రాయం లేకుండా ఎటువంటి పాఠశాలకు తరలించే పరిస్థితి ఉండదన్నారు. వాటితో పాటు స్మార్ట్ మీటర్లు పెట్టొద్దని విద్యుత్‌శాఖ జెఇని ప్రశ్నించగా వారు ఈ సమావేశంలో తీర్మానించారు. మండల సర్వసభ్య సమావేశంలో తీర్మానం చేసి ప్రభుత్వానికి అందించాలని రామస్వామి ఎంపిపిని కోరారు. దీనికి ఎంపిపి స్పందిస్తూ ఈ సమావేశంలో స్మార్ట్ మీటర్లు తమ మండలంలో పెట్టొద్దని తీర్మానించారు. అలాగే వెలుగు ఎపిఎంతో రావికోన విఒఎను నియమించకుండా చాలా నెలలు గడిచిపోయిందని ఇప్పటికైనా విఒఎను నియమించాలని, లేకుంటే భవిష్యత్తులో ఆందోళన తీవ్రంగా చేస్తామని హెచ్చరించడంతో ఎపిఎం మాట్లాడుతూ ఈనెల గడిచేలోపు సమావేశం ఏర్పాటు చేసి విఒఎను నియమిస్తామని తెలిపారు. అయితే సమావేశానికి మండల స్థాయి అధికారులు పూర్తిస్థాయిలో రావడం లేదు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి సర్వసభ్య సమావేశానికి అన్నిశాఖల అధికారులు వచ్చేలా చేయాలని కోరారు. అలాగే గత ప్రభుత్వం చేసిన తప్పే ఈ ప్రభుత్వం కూడా స్థానిక ప్రజాప్రతినిధులకు ఎటువంటి గౌరవం ఇవ్వకుండా పంచాయతీ పరిధిలో ఏ పనులు జరగాలన్నా సర్పంచులకు తెలియపరచకుండా అధికారులతో కుమ్మక్కయి అధికార పార్టీ నాయకులు పనులు చేసుకుంటున్నారని ఇలా చేస్తే గత ప్రభుత్వానికి ఈ ప్రభుత్వానికి తేడా ఏముందని రావికోన సర్పంచ్ ప్రశ్నించారు. ఇప్పటికైనా పంచాయతీ పరిధిలో ఏ పనులు వచ్చినా సర్పంచులకు తెలియపరచకుండా, తీర్మానం లేకుండా ఎలా చేస్తారని అన్నారు. సమావేశంలో ఎపిడిఒ జి.రమేష్, జెడ్‌పిటిసి బలగ రేవతమ్మ, వైస్ ఎంపిపిలు బంకూరు రవికుమార్, సిద్ధ జగన్నాథరావు, పలువురు సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని కార్మికుల ధర్నా



నగర పంచాయతీ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు

ప్రజాశక్తి - పాలకొండ

మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు రిటైర్మెంట్ వయస్సు 62 ఏళ్లకు పెంచాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ అయిన గ్రాడ్యుటీ, పెన్షన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ స్థానిక నగర పంచాయతీ కార్యాలయం ఎదుట ఎపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు అనుబంధం) జిల్లా కార్యదర్శి ఎన్‌వై నాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయం వద్ద కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు, సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాలా రమణారావు మాట్లాడుతూ పారిశుధ్య నిర్వహణలో విశేష కృషి చేస్తున్న మున్సిపల్ పారిశుధ్య కార్మికుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తుందని విమర్శించారు, మున్సిపల్ పారిశుధ్య కార్మికుల రిటైర్మెంట్ వయస్సు పెంచాలని డిమాండ్ చేశారు. కార్మికులను రిటైర్మెంట్ చేస్తున్న ప్రభుత్వం వారికి రిటైర్మెంట్ సదుపాయాలైన గ్రాడ్యుటి, పెన్షన్ సౌకర్యం కల్పించకపోవడం విచారకరమని అన్నారు. తక్షణమే మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు రిటైర్మెంట్ సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. గత మున్సిపల్ కార్మికుల సమ్మె నేపథ్యంలో అప్పటి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నేటి ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు.. వేసవి తాపం పెరుగుతున్నందున మే, జూన్ నెలల్లో మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు డ్యూటీ టైమింగ్స్ సవరించాలని కోరారు. తక్షణమే మున్సిపల్ పారిశుధ్య కార్మికుల సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని, లేనిచో సిఐటియు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కె.గంగునాయుడు, మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు సిహెచ్ సంజీవి, పి.వేణు, సురేష్, శ్రీదేవి, విమల, రఘు, వండన ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే విజయచంద్రకు వినతిని అందజేస్తున్న యుటిఎఫ్ నాయకులు

యుపి పాఠశాలలు ఎత్తివేయొద్దు

ఎమ్మెల్యేకు యుటిఎఫ్ నాయకుల వినతి

ప్రజాశక్తి - పార్వతీపురం

పాఠశాల విద్యలో సంస్కరణల్లో భాగంగా జిల్లాలో గల యుపి పాఠశాలలను ఎత్తివేయొద్దని, ప్రాథమిక పాఠశాల నుంచి 3,4,5 తరగతులను వేరు చేయొద్దని కోరుతూ యుటిఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యాన శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయచంద్రకు వినతిపత్రం అందజేశారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు తోట రమేష్, ప్రధాన కార్యదర్శి కె.భాస్కరరావు, రాష్ట్ర కార్యదర్శి మురళీమోహన్ రావు ఆధ్వర్యాన జిల్లా నాయకులు ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు పాఠశాల విద్యలో ప్రభుత్వం తీసుకొస్తున్న సంస్కరణల వల్ల భవిష్యత్తులో పేద పిల్లలు చదువుకు దూరమయ్యే అవకాశం ఉందని చెప్పారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ పేద పిల్లల కోసమే రాష్ట్ర ప్రభుత్వం ప్రతి పంచాయతీకి ఒక మోడల్ ప్రాథమిక పాఠశాలను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. యుటిఎఫ్ నాయకులు లేవనెత్తిన అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు.

త్వరలో సామాజిక మరుగుదొడ్ల మరమ్మతు పనులు : కమిషనర్

ప్రజాశక్తి - సాలూరు

మున్సిపాలిటీలో గత కొంతకాలంగా నిరుపయోగంగా ఉన్న సామాజిక మరుగుదొడ్ల మరమ్మతు పనులను త్వరలో ప్రారంభించనున్నట్లు కమిషనర్ బివి ప్రసాద్ చెప్పారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బుడా నుంచి రూ.1.05 కోట్లు మున్సిపాలిటీ కి మంజూరు కావాల్సి వుందని, ఆ నిధులు సకాలంలో రావడం లేదని చెప్పారు. శ్యామలాంబ పండుగ వచ్చేనెలలో నిర్వహించనున్న నేపథ్యంలో మరుగుదొడ్ల మరమ్మతు పనులు అత్యవసరంగా చేపట్టాల్సి వుందన్నారు. బుడా నిధుల మంజూరులో జాప్యం కారణంగా ప్రత్యామ్నాయంగా బిఆర్ ఎస్ గ్రాంట్ రూ.2కోట్లతో మరమ్మతు పనులు చేపడతామని తెలిపారు. 37 సామాజిక మరుగుదొడ్ల మరమ్మతు పనుల కోసం రూ.37 లక్షలు ప్రతిపాదించినట్లు తెలిపారు. అన్న క్యాంటీన్ నిర్మాణానికి రూ.11 లక్షల బిల్లు మంజూరు కోసం అప్‌లోడ్ చేశామని, ఇంకా మంజూరు కాలేదని చెప్పారు. పట్టణంలో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.1.25 కోట్లతో చేపట్టిన పనుల్లో రూ.31లక్షల వరకు పనులు పూర్తయ్యాయని చెప్పారు. పట్టణంలో 81శాతం ఆస్తి పన్ను వసూలు జరిగిందని, గత ఏడాది కంటే రూ.45 లక్షలు ఎక్కువగా వసూలైందని చెప్పారు. పట్టణంలో మరో 32 పైలట్ వాటర్ స్కీంల నిర్మాణానికి, 6 పైలెట్ వాటర్ స్కీంల మరమ్మతులకు చర్యలు తీసుకుంటామని కమిషనర్ బివి ప్రసాద్ తెలిపారు.

నాణ్యమైన జీడి పిక్కలు కొనుగోలు చేయాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

విడివికెలు ప్రారంభించబోతున్న జీడిపరిశ్రమ కొరకు నాణ్యమైన జీడిపిక్కలను కొనుగోలు చేయాలని స్థానిక ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీ వాస్తవ తెలిపారు. జీడి ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుపై వివిధ శాఖాధిపతులు, సిబ్బందితో సమన్వయ సమావేశాన్ని శుక్రవారం స్థానిక గిరిమిత్ర సమావేశ మందిరంలో పీఒ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీడి పరిశ్రమల స్థాపనకు జీడిపిక్కలు కొనుగోలు, ప్రాసెసింగ్, మార్కెటింగ్, ఆకర్షణీయమైన ప్యాకింగ్, బ్రాండింగ్ ప్రధానమని అన్నారు. కావున వాటిపై దృష్టి సారించాలని, అదే సమయంలో రైతులకు గిట్టుబాటు ధర లభించాలని సూచించారు. రైతుల నుంచి నాణ్యమైన జీడిపిక్కలను కొనుగోలు చేయాలని, జీడి పిక్కల కొనుగోలు నిమిత్తం గ్రామస్థాయిలో ప్రొక్యూర్ మెంట్ కమిటీకి ఇవ్వాలని ఆదేశించారు. జీడిపిక్కల ప్రాసెసింగుకు అవసరమైన పరికరాలను వీడీవీకెల ద్వారా కొనుగోలు చేయించాలని, అలాగే కొనుగోలు చేసిన జీడిపిక్కలు నిల్వ నిమిత్తం స్టోరేజీని గ్రామస్థాయిలో మరియు జీడి ప్రాసెసింగ్ యూనిట్ వద్ద ఏర్పాట్లుచేయాలని పేర్కొన్నారు. అదేవిధంగా ప్రాసెసింగ్ యూనిట్ కు కావలసిన అన్ని అనుమతులను ముందుగా పొందాలని తెలిపారు. జీడి పిక్కల కొనుగోలు, స్టోరేజీ, రవాణా, ప్రాసెసింగ్, విక్రయాలు తదితర అంశాలన్ని కచ్చితమైన రికార్డులు ఉండాలని ఆదేశించారు. జీడిపిక్కల మార్కెటింగ్ కి సంబంధించి వివిధ ట్రేడర్స్ తో చర్చించాలని,సంబందిత శాఖలన్ని సమన్వయంతో పనిచేసి వీడీవీకేల ద్వారా ప్రారంభించబోతున్న జీడి పరిశ్రమ లాభదాయకంగా నడవాలని ఆకాంక్షించారు. ఈ సమావేశంలో జిల్లా ఉద్యానవన అధికారి బి.మాధవి, పీడీ డిఆర్డిఏ సుధారాణి, వెలుగు ఏపీడి వై.సత్యం నాయుడు, పరిశ్రమల కేంద్రం జిల్లా మేనేజర్ ఎం.వి.కరుణాకర్, ఐటీడిఏ ఏపీడి మురళీధర్, ఇతర అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



లబ్దిదారులకు కుట్టుమిషన్లు అందజేస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

కుట్టు మిషన్లు ఆర్థికాభివృద్ధికి దోహదం

ప్రజాశక్తి - కురుపాం

కుట్టు మిషన్లు మహిళల ఆర్థిక అభివృద్ధికి దోహదపడతాయని ఎమ్మెల్యే తోయిక జగదీశ్వరి అన్నారు. మండలంలో గొటివాడ పంచాయతీ నేరేడువలస గ్రామంలో శుక్రవారం స్వార్డ్ సంస్థ డైరెక్టర్ బి.దయానంద్ ఆధ్వర్యంలో ఉచిత కుట్టు మిషన్‌లు పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్‌లు పంపిణీ చేయడం శుభపరిణామమనీ ఈ కుట్టు మిషన్‌ల ద్వారా మహిళలకు కుటుంబ పనులతో పాటు, ఆర్థికంగా ఎదుగుదలకు వాళ్ళ కాళ్ళ మీద వాళ్లు బతకడానికి ఉపయోగపడుతుందన్నారు. మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ కొండయ్య, మాజీ ఎంపిపి రమణమూర్తి, సోషల్ మీడియా కోఆర్డినేటర్ సుకేష్ చంద్ర పండా పాల్గొన్నారు.

శని, ఆదివారాల్లో సెలవు తీసుకోరాదు

ప్రజాశక్తి - పార్వతీపరం టౌన్

పట్టణంలో 15 సచివాలయాల్లో రికార్డ్ పెండింగ్ పనులను పూర్తి చేసే దిశగా ఉద్యోగులు కృషి చేయాలని, అందులో భాగంగా శని, ఆదివారాలు సెలవులు పెట్టకుండా విధులకు హాజరు కావాలని మున్సిపల్ కమిషనర్ సిహెచ్ వెంకటేశ్వర్లు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వర్క్ ఫ్రం హోం సర్వే శుక్రవారం మధ్యాహ్నంలోగా పూర్తి చేయాల్సి ఉందని, ఈ సర్వే మున్సిపాలిటీలో ఏ సచివాలయంలో ఒక్క రికార్డు పెండింగ్ ఉన్నా శని ఆదివారాల్లో ఆ సచివాలయాల్లో ఉద్యోగులంతా తప్పకుండా విధులకు హాజరై రికార్డులు పూర్తి చేయాలని ఆదేశించారు. అధికార్లు శని, ఆదివారాల్లో ఈ సర్వే పెండింగ్ ఉన్న ఏ సచివాలయాలను అయినా ఆకస్మికంగా తనిఖీ చేసే అవకాశం ఉందని, ఆ సమయంలో అక్కడ ఉద్యోగులు సర్వే చేయడం లేదని తెలిస్తే వెంటనే వారిపై తీవ్రమైన క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కావున సచివాలయ సిబ్బంది అంతా సర్వే పూర్తి చేయాలని సూచించారు.

తగ్గిన పోలమాంబ ఆదాయం

ప్రజాశక్తి - మక్కువ

రాష్ట్ర గిరిజన దేవతగా గుర్తింపు పొందిన పోలమాంబ అమ్మవారి 10 వారాల జాతరకు సంబంధించి గతేడాదితో పోల్చితే సుమారు రూ.12 లక్షల ఒక వేయి 542 రూపాయల ఆదాయం తగ్గుదల కనిపించిందని పోలమాంబ ఆలయ ఇఒ వివి సూర్యనారాయణ శుక్రవారం వెల్లడించారు. గత ఏడాది పది వారాల జాతరకు రూ. కోటీ 19 లక్షల 46వేల 517 ఆదాయం వచ్చిందన్నారు. ఈ ఏడాది రూ. కోటీ 7 లక్షల 44, 975 వచ్చిందని తెలిపారు. కొబ్బరి ముక్కలు, తలనీలాలు మినహా అన్ని విభాగాల్లో కూడా గ తేడాది కంటే ఆదాయం తక్కువ వచ్చిందన్నారు.



రోడ్డుపై పేరుకుపోయిన వ్యర్థాలు

కంపు భరించాల్సిందేనా?

ప్రజాశక్తి - పాలకొండ

స్థానిక నగర పంచాయతీలో పారిశుధ్య నిర్వహణ అంతంత మాత్రమే ఉంది. వీధుల్లో పారిశుధ్య నిర్వహణ కోసం చెప్పనక్కర్లేదు. ఆఖరుకు ప్రధాన రహదారుల్లో కూడా ఇదే పరిస్థితి కనిపిస్తుంది. నగర పంచాయతీ పరిధిలో వెంకటరాయిని కోనేరు దగ్గర చెత్త పోగులుగా కనిపిస్తున్నాయి. ఒక ఒక ప్రైవేట్ పాఠశాల కూడా ఉంది. ప్రజలు ఈ చెరువు దగ్గరే వాకింగ్ చేసుకుంటారు. అయినా చేసేదేమీ లేక ముక్కు మూసుకుంటూ వారి పని వారు చేసుకుంటున్నారు. నగర పంచాయతీ అధికారులు దీనిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

అంగన్వాడీ పోస్టు ఎస్‌టికి రిజర్వు చేయాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

సాలూరు మండలంలో దత్తివలసలో ఖాళీగా ఉన్న అంగన్వాడీ వర్కర్ పోస్టును ఎస్టీలకు రిజర్వ్ చేయాలని కోరుతూ కలెక్టర్ శ్యాం ప్రసాద్‌కు ఆదివాసీ వికాస్ పరిషత్ జిల్లా నాయకులు మజ్జి నారాయణరావు వినతిపత్రం అందజేశారు. ఇటీవల జిల్లాలో అంగన్వాడీ పోస్టుల భర్తీలో భాగంగా నోటిఫికేషన్ విడుదల చేశారని, బిసిలు లేని దత్తివలసలో అంగన్వాడీ వర్కర్ పోస్టును బిసి-ఎ కేటగిరీకి రిజర్వ్ చేయడం అన్యాయమని అన్నారు. పిటిజి తెగకు చెందిన గిరిజనులు ఎక్కువగా నివసిస్తున్న ఈ గ్రామంలో అంగన్వాడీ వర్కర్ పోస్టును ఎస్టీలకే కేటాయించాలని నారాయణరావు డిమాండ్ చేశారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలి

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

మండలంలోని సంగంవలస పంచాయతీ సీతంపేట 40 ఏళ్ల నుంచి మౌలిక సదుపాయాల్లేక ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే రహదారి, తాగునీటి సౌకర్యం కల్పించాలని సిపిఎం నాయకులు పి.రాము డిమాండ్ చేశారు. శుక్రవారం ఆ గ్రామాన్ని సందర్శించిన ఆయన మాట్లాడుతూ పంచాయతీ కేంద్రం సంగంవలస నుంచి గ్రామానికి రహదారి సౌకర్యం కల్పించాలని, వీధుల్లో కాలువలతో పాటు రక్షిత మంచినీటి సదుపాయం కల్పించాలని కోరారు. సమస్యల గురించి అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఇప్పటికైనా గ్రామానికి కావాల్సిన సౌకర్యాలు కల్పించాలని, లేకపోతే సిపిఎం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు మెలిక సత్యం, తాడంగి సోములు, మహిళా సంఘం నాయకులు పి.వరాలు, పంచాయతి కమిటీ నాయకులు తాడంగి పాపమ్మ, బారసమ్మ, మెలిక వద్దాయి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని తలవరంలో తాగునీటి సమస్య పరిష్కార మైంది. ఈ గ్రామంలోని దళితవీధిలో గత కొంతకాలంగా తాగునీటి సౌకర్యం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ గ్రామంలో సుమారు వంద కుటుంబాలు పైబడి నివాసం ఉంటున్నామని, తాము నీటి కోసం పడుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని సర్పంచ్ సిస్టు మధుసూదనరావు ఆదేశాల మేరకు పంచాయతీ నిధులతో బోరుబావుతో పాటు 5000 లీటర్ల సామర్థ్యం గల మంచినీళ్ల ట్యాంకును కూడా ఏర్పాటు చేయడం పట్ల దళితులు హర్షం వ్యక్తంచేశారు. ఈ మేరకు శుక్రవారం వీటిని సర్పంచ్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపిటిసి చందక గౌరీశ్వరి, నీటి సంఘం మాజీ అధ్యక్షులు చందక వెంకట రమణ, మాజీ ఎంపీటీసీ సత్తిబాబు, జనసేన మండల అధ్యక్షులు వండాన సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.



మంచినీటి ట్యాంకును ప్రారంభిస్తున్న సర్పంచ్ మధుసూదనరావు

సమస్యలపై సభ్యుల నిలదీత

మండల సర్వసభ్య సమావేశంలో ప్రశ్నల పర్వం

ప్రజాశక్తి - వీరఘట్టం

గ్రామాల్లోని వివిధ సమస్యలపై అధికారులను సభ్యులు నిలదీశారు. మండల సర్వసభ్య సమావేశం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి డి వెంకటరమణ నాయుడు అధ్యక్షతన శుక్రవారం జరిగింది. సమావేశానికి విశిష్ట అతిథులు ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ పాల్గొన్నారు. ఉదయం 10.30కు ప్రారంభం కావాల్సిన సమావేశం 11. 45గంటలకు ప్రారంభమైంది. ఈ సందర్భంగా రెవెన్యూ పద్దులకు సంబంధించి తహశీల్దార్ సిహెచ్ సత్యనారాయణ మాట్లాడుతుండగా ఎమ్మెల్సీ విక్రాంత్ జోక్యం చేసుకొని మండలంలో ఎన్ని రెవెన్యూ గ్రామాల్లో రీసర్వే పూర్తయిందని, భూ సమస్యలపై ఎన్ని ఫిర్యాదులు వచ్చాయి, ఎన్ని ఎన్ని పరిష్కారమయ్యావని ప్రశ్నించగా 200 ఫిర్యాదులు వచ్చాయని, 146 వరకు పరిష్కరించినట్లు తెలిపారు. 26 గ్రామాల్లో భూ రీసర్వే జరిగిందని, మరో మూడు గ్రామాల్లో రీ సర్వే జరుగుతుందని తహశీల్దార్ తెలిపారు. చలివేంద్రి గ్రామ ఎంపీటీసీ పోరెడ్డి వెంకట నాయుడు మాట్లాడుతూ డ్రోన్ కెమెరాలు తమ గ్రామం చుట్టూ తిప్పలేదని వివరించగా ఏ విధమైన తప్పులుంటే వాటికి సంబంధించిన పత్రాలు తీసుకొస్తే సరిచేస్తామని తహశీల్దార్ తెలిపారు. ఎమ్మెల్సీ విక్రాంత్ మాట్లాడుతూ వ్యవసాయ శాఖ సంబంధించి రాయితీతో కూడిన ఏ విధమైన పరికరాలు వచ్చినా? ఎంపీపీ, జడ్పిటిసి, తన దృష్టికి తీసుకురావడంతో పాటు జాబితాలు కూడా అందజేయాలని ఎఒను ఆదేశించారు. నీటిపారుదల శాఖకు సంబంధించి ఎఇ డివి వెంకటరమణ మాట్లాడుతుండగా ఎమ్మెల్సీ జోక్యం చేసుకొని ఎన్‌డిఎంఎఫ్ పనులు మండలానికి ఎన్ని మంజూరయ్యాయని ప్రశ్నించగా 7 మంజూరయ్యాయని ఎఇ వివరించారు. పనిచేయకుండా బిల్లులు పెడితే మీరు ఇబ్బందులు ఎదుర్కొంటారని హెచ్చరించారు. చలివేంద్రి ఎంపిటిసి మాట్లాడుతూ సైఫాన్ పనులు ఎప్పుడు చేస్తారు, అసలు పనులు పెడతారా? పెట్టరా? అని ప్రశ్నించారు. కాల్వ పనులు పూర్తి చేసేందుకు ధర్నాకైనా సిద్ధమవుతామని ఈ విషయాన్ని మంత్రి దృష్టి కూడా తీసుకెళ్తామని హెచ్చరించారు. తొలుత మాజీ ఎమ్మెల్యే పాలవలస రాజశేఖరం మృతికి సంతాపం తెలిపారు. కార్యక్రమంలో పలుశాఖ అధికారులు, ఎంపిటిసి సభ్యులు, సర్పంచులు పాల్గొన్నారు



ఇరిగేషన్ ఎఇని ప్రశ్నిస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్



ఐటిడిఎ వద్ద నిరుపయోగంగా ఉన్న అంబులెన్స్‌లు

అంబులెన్సులు వినియోగించరా?

ప్రజాశక్తి - వీరఘట్టం

జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో వినియోగం కోసం కొత్తగా మంజూరైన ఐదు అంబులెన్సులు నిరుపయోగంగా కనిపిస్తున్నాయి. స్థానిక ఐటిడిఎ కార్యాలయం వెనుక వాటిని దాచి పెట్టారు. ప్రముఖ బాలీవుడ్ నటుడు, సామాజిక కార్యకర్త సోనూసూద్ రెండు అంబులెన్సులు, న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ సంస్థ మూడు అంబులెన్సులను కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్ బిలిటీ కింద జిల్లాకు కేటాయించారు. వీటిని గత నెల 15న జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి ప్రారంభించారు. ఈ అంబులెన్సులను గుమ్మలక్ష్మీపురం, సాలూరు, సీతంపేట మండలాల్లోని పిహెచ్‌సిలకు జిల్లా అధికారులు కేటాయించారు. జిల్లాలో ఈ అంబులెన్స్ లను ప్రారంభించి 20రోజులు దాటినా అధికారులు ఇంకా వినియోగంలోకి తీసుకురాలేదు.ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనుల అత్యవసర ఆరోగ్య సేవలకు ఈ అంబులెన్స్‌ల అవసరం చాలా ఉంది. అయినా అధికారులు వాటిని మూలన పెట్టి వుంచడం చర్చనీయాంశమవుతోంది .దాతలిచ్చిన ఈ అంబులెన్స్ లను వెంటనే వినియోగంలోకి తీసుకురావాలని పలు గిరిజన సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. ఏజెన్సీలో అత్యవసర పరిస్థితుల్లో గిరిజన రోగులకు సేవలు అందించేందుకు ఈ వాహనాలు చాలా అవసరమని చెప్పారు.



అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న అధికారులు

బిసి కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

2024- 25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బిసి, బ్రాహ్మణ, క్షత్రియ, రెడ్డి, వైశ్య, ఈ బీసీ, కాపు కార్పొరేషన్ ద్వారా వివిధ రకాల యూనిట్లు బ్యాంకు రుణాలు, సబ్సిడీ నిమిత్తం మున్సిపల్ పరిధిలో గల 15 సచివాలయాల నుంచి వచ్చిన 969 దరఖాస్తుల లబ్ధిదారులకు శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ సిహెచ్ వెంకటేశ్వర్లు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ ఇంటర్వ్యూలు మెప్మా సిఒలు, ఆర్పీల పర్యవేక్షణలో మూడు స్టేట్ బ్యాంక్ గ్రూపులు కెనరా బ్యాంక్, యూనియన్ బ్యాంక్, సెంట్రల్ బ్యాంక్, ఏపీజీవీబీ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా, పంజాబ్, మహారాష్ట్ర బ్యాంక్ అధికారులు లబ్ధిదారులు ఆన్లైన్లో రిజిస్టర్ చేసిన 775 దరఖాస్తులను పరిశీలించారు. ఈ బ్యాంక్ రుణాల ఇంటర్వ్యూల కార్యక్రమంలో మెప్మా సిఒలు ఈశ్వరరావు, ప్రశాంతి, పద్మ, ఆర్పీలు పాల్గొన్నారు.

మెప్మా ఇన్చార్జి సి ఎం ఎం గైర్హాజరు.

స్థానిక మున్సిపాల్టీలో బిసి కార్పొరేషన్ రుణాల మంజూరుకు నిర్వహించిన ఇంటర్వ్యూల ప్రక్రియ జరుగుతున్నప్పటికీ ఇన్‌ఛార్జి సిఎంఎంగా విధులు నిర్వహిస్తున్న కృష్ణారావు హాజరు కాకపోవడంపై పలు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గ్రేడ్ వన్ మున్సిపాలిటీకి ఇంత వరకు రెగ్యులర్ మెప్మా సిఎంఎంను నియమించకపోవడం ఏమిటో అన్న విమర్శలు కూడా వెళు వెత్తుతున్నాయి. ఈ విషయంపై ఉమ్మడి జిల్లాల మెప్మా పీడీ దృష్టి సారించి రెగ్యులర్ సిఎంఎంను నియమించేందుకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



నేచర్ టూర్‌లో పాల్గొన్న విద్యార్థులు

నేచర్ క్యాంపునకు సాలూరు, పాచిపెంట విద్యార్థులు

ప్రజాశక్తి - పాచిపెంట

ఎపిఎన్జీసి, అటవీ శాఖ ఆధ్వర్యంలో సాలూరు, పాచిపెంట మండలాల్లో 10 ఉన్నత పాఠశాలకు సుమారుగా 30 మంది విద్యార్థులను ఆలూరు అటవీ ప్రాంతానికి నేచర్ క్యాంపును శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు అటవీ సంరక్షణ, ప్రకృతి సంరక్షణ, విత్తన బంతులను తయారీ విధానాన్ని విద్యార్థులు ఆయాశాఖల అధికారులు వివరించారు. అనంతరం విద్యార్థులకు డ్రాయింగ్ పోటీ నిర్వహించారు. విజేతలకు ఫారెస్ట్ ఆఫీసర్ సత్యనారాయణ బహుమతి ప్రదానం చేశారు. ఈ పోటీల్లో మామిడిపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులు ఒక స్కిట్ ప్రదర్శించి అందరికీ ప్రకృతి సంరక్షణ పట్ల ఒక మంచి అభిప్రాయాన్ని కలగజేశారు. కార్యక్రమంలో అటవీశాఖాధికారి అవతారం, పాంచాలి, కొత్తవలస, మాతుమూరు తదితర గ్రామాల ఉపాధ్యాయులు, వ్యవసాయశాఖ అధికారులు, ఎపి ఎన్జీసి కస్టర్ కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.



బోరును మరమ్మతు చేయిస్తున్న సర్పంచ్ మిన్నారావు

దాహార్తి తీర్చేందుకే క్రాస్ ప్రోగ్రాం

ప్రజాశక్తి - కురుపాం

వేసవిలో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా దాహార్తిని తీర్చేందుకే ముందస్తు చర్యల్లో భాగంగా క్రాస్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నామని మండలంలో జి.శివడ సర్పంచ్ బి. మిన్నారావు అన్నారు. శుక్రవారం పంచాయితీలో మరమ్మతులకు గురైన బోర్లను దగ్గరుండి పర్యవేక్షించి రిపేర్లను చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు పంచాయతీలో అన్ని గ్రామాల్లో తాగునీటి సౌకర్యం కోసం స్కీములు ఉన్నాయని అలాగే మరమ్మతులకు గురైన బోర్లను కూడా బాగు చేయిస్తామని, పంచాయతీలో శత శాతం ప్రజలకు తాగునీరు అందిస్తున్నామని, ఇంకా ఏ గ్రామంలోనైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకొస్తే వెంటనే పరిష్కరిస్తానని అన్నారు.

40 లీటర్ల నాటు సారా స్వాధీనం

ప్రజాశక్తి - కురుపాం

జియ్యమ్మవలస మండలం చినమేరంగికి చెందిన రాజోలు అప్పలస్వామి, బొమ్మాళి సుందరమ్మ అక్రమంగా నాటు సారా అమ్ముతుండగా ముందస్తు సమాచారం మేరకు శుక్రవారం సాయంత్రం దాడులు జరిపి ఒక్కొక్కరి వద్ద 20 లీటర్లు నాటు సారాను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామని ఎక్సైజ్ సిఐ పి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా నాటు సారా అమ్మినా, తయారు చేసినా, తరలించినా అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐ జె.రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

సీతంపేట : మండలంలోని దోనుబాయి పోలీస్ స్టేషన్ పరిధిలో గల గెద్దకోటలో 20 లీటర్ల నాటుసారాతో బి.తిరుపతిరావు అనే వ్యక్తిని పట్టుకొని అరెస్ట్ చేసినట్టు దోనుబాయి పోలీసులు తెలిపారు.

10న పండ్ల తోటల బహిరంగ వేలం

ప్రజాశక్తి - పార్వతీపురం

2025-26 సంవత్సరానికి గాను గుమ్మలక్ష్మీపురం మండలం సవర కోటపాడులో హెచ్ఎన్‌సిటిసి ఫారంలో గల జీడిమామిడి, కొబ్బరి, సపోట, మామిడి పండ్ల తోటలు, కురుపాం మండలం రస్తా కుంటుబాయిలో జీడిమామిడి తోటకు సంబంధించి ఫలసాయం బహిరంగ వేలం ద్వారా విక్రయించడానికి గిరిజన రైతుల నుంచి టెండరు దరఖాస్తులను కోరుతున్నట్లు ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాస్తవ శు క్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. దరఖాస్తును పిఒ, లేదా హెచ్.యన్.సి.టి.సి నర్సరీ, సవరకోటపాడు వద్ద రూ.200 చెల్లించి పొందవచ్చని అన్నారు. ఈ నెల 7 నుంచి 9 వరకు గిరిజన రైతుల నుంచి దరఖాస్తులను కార్యాలయ పనిచేయు వేళల్లో స్వీకరించబడునని వివరించారు. వేలం ఈనెల 10న ఉదయం 10.30 గంటలకు గిరిమిత్ర సమావేశ మందిరం, ఐటిడిఎ ప్రాంగణంలో జరుగుతుందన్నారు. ఏ కారణం తెలపకుండా వేలం పాటను రద్దు చేయు అధికారం, అగ్రిమెంట్ ను సవరించు లేదా మార్పుచేయు అధికారం పోజెక్టు అధికారికి సర్వహక్కులు ఉన్నాయని అన్నారు. ఆసక్తి గల గిరిజన రైతులు ఈ వేలం పాటలో పాల్గొనాలని ఆయన ఆ ప్రకటనలో పిలుపునిచ్చారు.

కోట దుర్గమ్మకు బంగారు పుస్తెల తాడు బహూకరణ

ప్రజాశక్తి -పాలకొండ

స్థానిక కోట దుర్గామ్మవారికి 26 గ్రాముల బంగారం పుస్తెలతాడు విశాఖపట్నానికి చెందిన సాయికుమార్ దంపతులు శుక్రవారం బహూకరించారు. అదేవిధంగా రెండు మంగళసూత్రాలను కూడా అందించారు. ఆలయ ప్రధాన అర్చకులు దార్లపూడి లక్ష్మీప్రసాద్ శర్మ వేమకోటి శ్రీనివాసరావుకు అందించారు.

నాణ్యతా ప్రమాణాలతో పనులు పూర్తి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్


నాణ్యత ప్రమాణాలతో అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని స్థానిక ఎమ్మెల్యే బోనులు విజయ్ చంద్ర సంబంధిత కాంట్రాక్టర్లతో అన్నారు. శు క్రవారం కొత్తవలసలోని 5,8 వార్డుల్లో రూ.11 లక్షల 35 వేల వ్యయంతో మున్సిపల్ సాధారణ నిధులతో సీసీ కాలువలు, రోడ్ పనులకు ఆయా వార్డు కౌన్సిలర్లు కోల సరిత, కోరాడ నారాయణరావుతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పలు వార్డుల్లో ప్రజలకు కావాల్సిన మౌలిక సదుపాయాలను గుర్తించామని, ఇందులో భాగంగా ఈ రెండు వార్డుల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సిహెచ్ వెంకటేశ్వర్లు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ బెలగాం జయప్రకాష్ నారాయణ, టిడిపి పట్టణ అధ్యక్షులు గుంట్రెడ్డి. రవికుమార్, కౌన్సిలర్లు బడే. గౌరి నాయుడు, బొత్స ఆనంద్,మజ్జి.పారినాయుడు,టిడిపి నాయకులు డాక్టర్ గరిమెళ్ళ భాను ప్రసాద్, కోలా మధు, పత్తి గిల్లి సత్యనారాయణ, గౌరీ శంకర్, బూరి కష్ణ, తదితరులు పాల్గొన్నారు.



పార్వతీపురం-కురుపాం రోడ్డుపై సంచరిస్తున్న ఏనుగుల గుంపు

క్షణ క్షణం ఏనుగుల భయం

ప్రజాశక్తి - కురుపాం



ఏనుగుల దాడి పగిలిన వ్యాన్ అద్దాలు

కురుపాం నియోజకవర్గ ప్రజలకు క్షణక్షణం ఏనుగుల భయంతో కంటిమీద కునుకు లేకుండా పోతుంది. శుక్రవారం ఉదయం జియ్యమ్మ వలస మండలం పెదమేరంగి జంక్షన్ వద్ద కురుపాం గ్రామానికి చెందిన వ్యక్తి వ్యాను చింతపండు లోడుతో వెళ్తుండగా వ్యాన్‌పై ఏనుగులు దాడి చేశాయి. దీంతో డ్రైవర్, క్లీనరు పరుగులు తీసి ప్రాణాలు కాపాడుకున్నారు. వ్యానులో ఉన్న చింతపండును చిందర వందర చేసి వ్యాన్ అద్దాలను పగలగొట్టాయి. అంతేకాకుండా నిత్యం పంట పొలాలపై పడి పంటలను నాశనం చేస్తున్నాయి. రైతులు పొలాలకు వెళ్లాలంటే భయభ్రాంతులకు గురై ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని వెళ్లాల్సి వస్తుంది. ఇప్పటికైనా అటవీ శాఖ అధికారులు స్పందించి ఏనుగులను తమ గ్రామాల నుంచి దూరంగా అటవీ ప్రాంతాలకు తరలించి తమ ప్రాణాలను, పంటలను కాపాడాలని కోరుతున్నారు.



విచారణ నిర్వహిస్తున్న ఐటిడిఎ పిఒ యశ్వంత్‌కుమార్‌రెడ్డి

బోగస్ కుల ధ్రువ పత్రాలపై విచారణ

ప్రజాశక్తి- సీతంపేట

బోగస్ కుల ధ్రువపత్రాలకు సంబంధించిన డిఎల్‌సి విచారణను శు క్రవారం ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి నిర్వహించారు. ఈ సందర్భంగా బోగస్ కుల ధృవీకరణ పత్రాలు పొందినట్లు విచారణ ఎదుర్కొంటున్న వారిని పిఒ విచారించారు. ఈ సందర్భంగా వారి వద్ద ఉన్న ఆధారాలను పరిశీలించారు. మరిన్ని ఆధారాలు సేకరించి పూర్తి వివరాలు సమర్పించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎపిఒ జి.చిన్నబాబు, డీడీ అన్నదొర, సూపరిండెంట్ దేశ్ ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తోటపల్లిలో శ్రీరామనవమి

గరుగుబిల్లి : మండలంలోని తోటపల్లి వెంకటేశ్వర స్వామి గుడిలో ఆదివారం శ్రీ రామ నవమి వేడుకలను నిర్వహించనున్నామని, ఇందులో భాగంగా సీతారామస్వామి కళ్యాణ మహోత్సవాన్ని కూడా నిర్వహిస్తామని ఆలయ కార్యనిర్వాహణధికారి వివి సూర్యనారాయణ తెలిపారు. ఆ రోజు సాయంత్రం సీతారామస్వామి పట్టాభిషేకం నిర్వహిస్తామన్నారు.

తెగుళ్ల నివారణపై రైతులకు అవగాహన

ప్రజాశక్తి- సీతంపేట

మండలంలోని పులిపుట్టి పంచాయతీ పరిధిలోని పాత రేగులగూడ గ్రామంలో వెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో పచ్చి రొట్టే ఎరువులు, పురుగులు, తెగుళ్లపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రిసోర్స్ పర్సన్ పాలక, నాగేశ్వరరావు పచ్చిరొట్టె ఎరువులు, జిలుగు, తట్టిలు, పిల్లిపెసర, 9 నుంచి 18 రకాలు విత్తనాలు భూమిలో వేసి దున్నడం వల్లన భూమిలో పోషకాలు పెరిగి మంచి పంట దిగుబడి వస్తుందని చెప్పారు. ముఖ్య అతిథిగా సైంటిస్ట్ లక్ష్మీనారాయణ హాజరై చిరుధాన్యాలు ప్రాముఖ్యత వివరించారు. ఆరోగ్యంగా ఉండాలనుకుంటే ప్రతి రైతు పంట పండించి ఆహారం తీసుకుంటూ ఆరోగ్యం మెరుగు పరుచుకోవాలన్నారు. చిరుధాన్యాలు వల్లన తక్కువ పెట్టుబడి, ఆదాయం ఎక్కువ పొందవచ్చును అని చెప్పారు. అందుకు ప్రతి రైతు కొంత విస్తీర్ణంలో చిరుధాన్యాలు వెయ్యాలన్నారు. ప్రస్తుతం వాతావరణంకు అనుకూలమైన పంటలు వేసి ఆరోగ్యం, ఆదాయం, జీవనం సాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు తదితరులు పాల్గొన్నారు.



తెగుళ్ల నివారణపై రైతులకు అవగాహన కల్పిస్తున్న రిసోర్స్ పర్సన్లు

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి - పాలకొండ

మండలంలోని తంపటాపల్లిలో అమ్మ ఒడి అనాధ ఆశ్రమం 10వ వార్షికోత్సవం సందర్భంగా ఆశ్రమ ఆవరణంలో శ్రీ విజయ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ సంజీవ రక్ష ఫౌండేషన్ సౌజన్యంతో ఉచిత మెగావైద్య శిబిరం శుక్రవారం నిర్వహించారు. ఈ శిబిరాన్ని విజయ హాస్పిటల్ చైర్మన్ దూబ పద్మావతి ప్రారంభించారు. అనంతరం సుమారు 200 మందికి వైద్యపరీక్షలు చేసి తగిన సూచనలు, సలహాలు అందజేశారు. అంతేకాకుండా రక్త పరీక్షలు, ఉచిత మందులు పంపిణీ చేశారు. అనంతరం అమ్మఒడి అనాధాశ్రమంలో గల విద్యార్థిని విద్యార్థులకు విందును ఏర్పాటు చేసి వారి భవిష్యత్తులో మంచి స్థాయిని పొందుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైద్యులు సాయి శంకర్ ఎమర్జెన్సీ మెడిసిన్ వైద్యులు వెలంగణి, ఉప సర్పంచ్ జాడ శ్రీధర్, బొమ్మాలి బాబ్జీ, రాయి రామకృష్ణ, బత్తిన మోహన్, పొట్నూర్ రమేష్, రాజు, హాస్పిటల్ మేనేజర్ కనుగుల ధర్మ, అసిస్టెంట్ మేనేజర్ గూన రమేష్, రవి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

6న లలిత విద్యా గణేశ పీఠం ప్రారంభం

ప్రజాశక్తి -గుమ్మలక్ష్మీపురం

ఈ నెల 6న శ్రీరామ నవమి సందర్భంగా మండలంలోని గుణదలో శ్రీ లలిత విద్యా గణేశ పీఠం (ఆశ్రమం) ప్రారంభోత్స కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరు కావాలని బొబ్బిలి ఎమ్మెల్యే బేబీ నాయనను దుమ్మంగి సర్పంచి పాలక క్రాంతి కుమార్, యుటిఎఫ్ మండల కార్యదర్శి పత్తిక ప్రసాద్ రావు ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో దుమ్మంగి గ్రామస్తులు,మహిళాలు, యువత పాల్గొన్నారు.

తామరకండిలో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని తామరకండిలో సర్పంచ్ ఎం.లలితకుమారి, వెంకటనాయుడు ఆధ్వర్యంలో పారిశుధ్య పనులను చేపట్టారు. గ్రామ దేవత పండగ నేపథ్యంలో గ్రామంలో పూడుకతీతలు పారిశుధ్య పనులు చేపట్టి శుభ్రం చేయిస్తున్నారు. అలాగే ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని చలివేంద్ర కేంద్రాన్ని ప్రారంభించారు. ప్రయాణికులు ఎటువంటి ఇబ్బందులకు గురికాకుండా ఉండేందుకు ఈ కేంద్రాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు ప్రభావతి, గ్రామస్తులు పాల్గొన్నారు.